# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక



## విలేకరులు కావలెను

తెలంగాణ & ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు
- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు
- RC ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు

-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:- 9705770909 సంప్రదించండి.



సంచిక : 22 | సంపుటి : 3 | తెలంగాణ ఆంధ్రప్రదేశ్ | మంగళవారం | 22-4 -2025 | వెల : .రూ. 5.00




### చిన్న పిల్లల అక్రమ రవాణాపై

## సుప్రీం ఆగ్రహం

- ఆచూకీ లేకుండా పోయిన పిల్లలను కనిపెట్టండి
- ఢిల్లీ పోలీసులకు సుప్రీం ఆదేశాలు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 21(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
దేశ రాజధాని ఏరియాలో ఇటీవల అదృశ్యమైన ఆరుగురు పిల్లలను రక్షించాలని ఢిల్లీ పోలీసులను సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ సందర్భంగా పిల్లల అక్రమ రవాణా పై సర్వోన్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. చిన్నారుల అక్రమ రవాణాకు పాల్పడేవారిని చట్టం ముందు నిలబెట్టాలని, అలాంటి ముఠాలు ఈ సమాజానికి ఎంతో ప్రమాదకరమని హెచ్చరించింది.

-మిగతా 2 లో

### ఒసాకా ఎక్స్‌పోలో


# తెలంగాణ పెవిలియన్

**పెవిలియన్‌లో భారత రైజింగ్ బృందం**

- ప్రతి ఐదేళ్లకు ఒకసారి ఒసాకో ఎక్స్‌పో నిర్వహణ
- సాంస్కృతిక వారసత్వం, పర్యాటక సంపదను ప్రతిబింబించే ప్రదర్శనలు
- ఒసాకా ఎక్స్‌పోలో పాల్గొన్న మన దేశంలోని తొలి రాష్ట్రం తెలంగాణ
- ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్ 21(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జపాన్‌లోని ఒసాకా లో జరుగుతున్న ప్రతిష్ఠాత్మక ఒసాకా ఎక్స్ పోలో తెలంగాణ రాష్ట్రం తన ప్రత్యేకమైన పెవిలియన్‌ను ఘనంగా ప్రారంభించింది. కిటాక్యూషు నుంచి ఒసాకా చేరుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం సోమవారం ఉదయం భారత పెవిలియన్లో అడుగుపెట్టింది. భారత పెవిలియన్లో ప్రత్యేకంగా

-మిగతా 2 లో





## ప్రజాసంక్షేమం లక్ష్యంగా నిర్ణయాలు

- ప్రజల జీవితాలు ప్రభావితం చేసేలా చర్యలు
- సీవిల్ సర్వీసెస్ డే లో ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 21(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
తమ ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలు దేశ ప్రజల వెయ్యేళ్ల భవిష్యత్తును ప్రభావితం చేస్తాయని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. తాము తినుకుంటున్న నిర్ణయాలు దేశాభివృద్ధిని కాంక్షించి తీసుకుంటున్నాయేనని అన్నారు. సమగ్ర అభివృద్ధి అంటే

-మిగతా 2 లో



### పోప్ ఫ్రాన్సిస్

## కన్నుమూత

- ఇటీవలే ఆస్పత్రి నుంచి విడుదల
- సంతాపం తెలిపిన ప్రపంచనేతలు
- ప్రధాని మోడీ, తెలుగు రాష్ట్రల సీఎంల సంతాపం

**న్యూఢిల్లీ ఏప్రిల్ 21(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
వాటికన్ సిటీలో పోప్ ఫ్రాన్సిస్ సోమవారం ఉదయం మృతి చెందారు. కేథలిక్‌ల అత్యున్నత మత గురువు పోప్ ఫ్రాన్సిస్ (88) ఇటలీ కాలమానం ప్రకారం సోమవారం ఉదయం 7.35కు కన్నుమూశారు. ఆయన గత కొంతకాలంగా శ్వాసకోశ సమస్యలు,

-మిగతా 2 లో

## అంబేద్కర్ అందరివాడు



- కొందరికే పరిమితం చేయడం తగదు
- కేంద్రమంత్రి బండి సంజయ్ వెల్లడి

**కరీంనగర్, ఏప్రిల్ 21(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
అంబేద్కర్ అందరివాడని, ఆయనను కేవలం దళితులకు చెందిన నేతగా చూడరాదని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. కరీంనగర్ శుభమంగళ గార్డెన్‌లో జయంతి ఉత్సవాల్లో

-మిగతా 2 లో

## కేటిఆర్‌కు హైకోర్టులో ఊరట



- ఉట్నూరు కేసు కొట్టివేత

**హైదరాబాద్, ఏప్రిల్ 21(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు తెలంగాణ హైకోర్టులో భారీ ఊరట లభించింది. ఉట్నూరు పోలీస్‌స్టేషన్‌లో నమోదైన ఎఫ్ఐఆర్‌ను న్యాయస్థానం కొట్టివేసింది. గతేడాది సెప్టెంబర్‌లో కేటీఆర్‌పై ఉట్నూరు పీఎస్‌లో కేసు నమోదు అయింది. కాంగ్రెస్ నాయకురాలు ఆత్రం సుగుణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసును ఛాలెంజ్ చేస్తూ కేటీఆర్ హైకోర్టును ఆశ్రయించారు.

-మిగతా 2 లో



## జార్ఖండ్‌లో ఎన్‌కౌంటర్

### 8 మంది మావోయిస్టుల మృతి

**రాంచీ, ఏప్రిల్ 21(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జార్ఖండ్‌లోని బొకారో జిల్లాలో మావోయిస్టులు, భద్రతాబలగాలకు మధ్య ఎదురుకాల్పుల్లో 8మంది మృతిచెందారు. ఈ ఎన్‌కౌంటర్‌లో ఎనిమిది మంది మావోయిస్టులు మృతిచెందారు. సోమవారం తెల్లవారుజామున బొకారో జిల్లాలోని లాల్‌పానియా ప్రాంతంలో మావోయిస్టులు ఉన్నరన్న సమాచారంతో సీఆర్‌పీఎఫ్‌కు చెందిన 209 కమాండో బెటాలియన్ ఫర్ రిసొల్యూట్ యాక్షన్ (కోబ్రా) దళాలు, స్థానిక పోలీసులు సంయుక్తంగా కూంబింగ్ చేపట్టారు. ఈ క్రమంలో ఉదయం 5.30 గంటల సమయంలో

-మిగతా 2 లో

### తెలంగాణ తెచ్చుకున్నదే

# ఉద్యోగాల కోసం



- గతంలో కొందరి ప్రయోజనాలే నెరవేరాయి
- మధిరలో మెగా జాబ్ మేళా కార్యక్రమం భట్టి

**ఖమ్మం, ఏప్రిల్ 21(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
తెలంగాణ రాష్ట్రం తెచ్చుకున్నదే ఉద్యోగాల కోసం అని, తెలంగాణ తెచ్చుకున్నాక ఓ కుటుంబానికి మాత్రమే ఉద్యోగాలు వచ్చాయని డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రజా పాలనలో నిరుద్యోగులందరికీ పారదర్శకంగా ఉద్యోగాలు ఇస్తున్నామన్నారు. బీఆర్ఎస్ హయాంలో పేపర్ లీకేజీలతో


-మిగతా 2 లో

## తెలంగాణలో రోహిత్ వేముల చట్టం

### రేవంత్‌కు రాహుల్ లేఖ

**హైదరాబాద్, ఏప్రిల్ 21(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ సోమవారం లేఖ రాశారు. తెలంగాణలో వేముల రోహిత్ చట్టాన్ని అమలు చేయాలని రాహుల్ గాంధీ లేఖలో కోరారు. ఇప్పటికే కర్నాటక సిఎం

-మిగతా 2 లో





### మజ్లిస్ కోసమే పోటీకి

## బీఆర్ఎస్ దూరం

- ఏ ప్రాతిపదికన పోటీకి దూరంగా ఉన్నారో చెప్పాలి
- మీడియా సమావేశంలో కిషన్ రెడ్డి విమర్శలు

**హైదరాబాద్, ఏప్రిల్ 21(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
నగరంలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలో భారాస ఎందుకు పోటీ చేయడంలేదో ఆ పార్టీ అధినేత కేసీఆర్ చెప్పాలని కేంద్రమంత్రి, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. అత్యధిక ఓట్లు ఉన్నా ఏ ప్రాతిపదికన పోటీ చేయడం లేదో చెప్పాలన్నారు. నాంపల్లిలోని భాజపా రాష్ట్ర

-మిగతా 2 లో

# పోప్ ఫ్రాన్సిస్ కన్నుమూత

(మొదటి తరువాయి)

డబుల్ న్యూమోనియా, కిడ్నీ సమస్యలతో తీవ్రంగా బాధపడ్డారు. ఫిబ్రవరి 14 నుంచి ఆయన 38 రోజుల పాటు ఆసుపత్రిలో చికిత్స పొందిన అనంతరం గత నెల డిశ్చార్జి అయ్యారు. ఆయన మృతి విషయాన్ని వాటికన్ వర్గాలు ధ్రువీకరించాయి. 2013లో పోప్ బెనిడెక్ట్ తర్వాత ఫ్రాన్సిస్ ఈ బాధ్యతలు చేపట్టారు. ఫ్రాన్సిస్ 1938లో అర్జెంటీనాలో జన్మించారు. దక్షిణ అమెరికా నుంచి ఈ పదవిని అందుకొన్న తొలి వ్యక్తి ఆయనే. తరచూ సామాజిక అంశాలపై కూడా పోపం వ్యాఖ్యలు చేస్తుంటారు. 2016లో రోమ్ బయట ఇతర మతానికి చెందిన శరణార్థుల పాదాలు కడిగారు. దీనిని ఆయన వినయం, సేవాతత్పరతకు చిహ్నంగా భావిస్తారు. పోప్ ఫ్రాన్సిస్ తన మరణానికి కొన్ని గంటల ముందు కూడా ఈస్టర్ పర్వదినాన భక్తులకు సందేశం ఇచ్చారు. వాటికన్ నగరంలోని పీటర్స్ స్క్వేర్‌లో దాదాపు 35,000 మందిని ఉద్దేశించి ఆయన ప్రపంచం కోసం సందేశం ఇచ్చారు. 'బ్రదర్స్ అండ్ సిస్టర్స్, హ్యాపీ ఈస్టర్..!' అని పోప్ స్వయంగా చెప్పారు. అనంతరం ఆయన సందేశాన్ని ఆర్చి బిషప్ డియాగో రావెలి చదివి వినిపించారు. సంక్షోభాలతో రగులుతున్న గాజా, ఉక్రెయిన్, కాంగో, మయన్మార్‌లలో శాంతి నెలకొనాలని ఆకాంక్షించారు. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ తన భార్య ఉషతో కలిసి ఈస్టర్ సందర్భంగా పోప్‌ను కలిశారు. ఈ సందర్భంగా పోప్ మూడు పెద్ద చాకొలెట్ ఈస్టర్ ఎగ్స్‌ను వాన్స్ దంపతులకు బహూకరించారు. ఆయన అనారోగ్యం పాలైన తర్వాత అంతమంది జనాల్లోకి రావడం ఇదే తొలిసారి. ప్రత్యేక వాహనంలో ప్రజల మధ్య నుంచి ఆయన ప్రయాణించడం విశేషం. మధ్యలో ఆగి పసికందులను, చిన్నారులను ఆశీర్వదించారు. ఆదివారం జరిగిన ఈస్టర్ వేడుకల్లో సైతం ఆయన పాల్గొన్నారు. ఈ మేరకు వాటికన్ సిటీ-వర్గాలు వెల్లడించాయి. పోప్ ఫ్రాన్సిస్ తన 12 ఏళ్ల వయస్సు నుంచే చర్చి, సమాజం, అట్టడుగు వర్గాల కోసం అంకితభావంతో పని చేశారు. 1936,డిసెంబర్ 17వ తేదీన అర్జెంటీనాలో పోప్ ఫ్రాన్సిస్ జన్మించారు. 2013 మార్చి 13న 266వ పోప్‌గా ఫ్రాన్సిస్ ఎంపికయ్యారు. ఆయన మృతి పట్ల ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పోప్ ఫ్రాన్సిస్ మృతికి ఆయన సంతాపాన్ని తెలిపారు. ఆయన మరణం తనను తీవ్రంగా కలత పెట్టిందన్నారు. భారత ప్రజలపై పోప్ ఫ్రాన్సిస్ ప్రేమాభిమానాలు నిత్యం నిలిచి ఉంటాయని ఆయన వ్యాఖ్యానించారు. కాథలిక్ సమాజానికి ఈ సందర్భంగా ఆయన తన సంతాపాన్ని తెలిపారు. అలాగే

చిన్ననాటి నుంచి క్రీస్తు ఆదర్శాలను పోప్ ఫ్రాన్సిస్.. తనను తాను అంకితం చేసుకున్నారని వివరించారు. పేదలు, అణగారిన ప్రజలకు ఆయన సేవలందించారని గుర్తు చేశారు. దేవుని ఆలింగనంలో ఆయన ఆత్మకు శాశ్వత శాంతి లభిస్తుందని ఈ సందర్భంగా ప్రధాని మోదీ విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రపంచవ్యాప్తంగా 1.4 బిలియన్ల మంది కాథలిక్కులు.. పోప్ ఫ్రాన్సిస్‌ను ఆరాధిస్తున్న సంగతి తెలిసిందే. గతేడాది ఇటలీలో జీ7 శిఖరాగ్ర సమావేశం జరిగింది. ఈ సమావేశం వేదికగా పోప్‌ను ప్రధాని మోదీ కలిసి సంగతి తెలిసిందే.

## చిన్న పిల్లల అక్రమ రవాణాపై సుప్రీం ఆగ్రహం

(మొదటి తరువాయి)

నవజాత శిశువులను లక్షల రూపాయలకు అమ్ముతున్నట్లు- వచ్చిన వార్తలపై జస్టిస్ జేబీ పార్థివాలా, జస్టిస్ ఆర్ మాధవన్‌లతో కూడిన సుప్రీం ధర్మాసనం సుమోటోగా విచారణ చేపట్టింది. 'ఆ ఆరుగురు చిన్నారుల ఆచూకీని గుర్తించండి. పిల్లలను అమ్ముతున్న, కొంటున్న వారిని చట్టం ముందు నిలబెట్టండి. వారందరూ నిందితులే. వారంతా సమాజానికి పెద్ద ముప్పుగా పరిణమించారు' అని సుప్రీం ధర్మాసనం వ్యాఖ్యానించింది. పిల్లల అక్రమంగా రవాణా చేసేవాళ్లు హంతకులకంటే ప్రమాదకరమని జస్టిస్ పార్థివాలా అన్నారు. 'ఎవరైనా ఒక వ్యక్తిని హత్య చేస్తే దాని వెనుక పలు కారణాలు, ఉద్దేశాలు ఉంటాయి. ఆ తర్వాత అతడు మరో హత్య చేయకపోవచ్చు. కానీ పిల్లలను కిడ్నాప్ చేసి అమ్మేవారు ఆ నేరాలకు మళ్లీమళ్లీ పాల్పడుతున్నారు. వారు ఈ సమాజానికి హంతకుల కంటే ప్రమాదకరమైనవారు' అని సుప్రీంకోర్టు ఆందోళన వెలిబుచ్చింది. ఢిల్లీలో పిల్లల అక్రమ రవాణా రాకెట్ వెనుకున్న కీలక సూత్రధారిని వెంటనే పట్టుకోవాలని పోలీసులను సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. ఢిల్లీ పరిసర ప్రాంతాల్లో చిన్నారులను రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు విక్రయిస్తున్నారని, దీని వెనుక ఒక పెద్ద ముఠా పనిచేస్తున్నట్లు- వార్తలు వస్తున్నాయని పేర్కొంది. ఈ సందర్భంగా పోలీసులు.. కొందరు పిల్లలను ఎవరూ కిడ్నాప్ చేయడం లేదని, తల్లిదండ్రులే విక్రయిస్తున్నారని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. దాంతో పిల్లలు దొరికినా ఎవరైనా తల్లిదండ్రులు వారిని తిరిగి తీసుకోవడానికి తల్లిదండ్రులు సిద్ధంగా లేకపోతే.. ప్రభుత్వమే వారి బాధ్యత తీసుకోవాలని కోర్టు సూచించింది. ప్రతి ఏడాది దాదాపుగా రెండు వేల మంది పిల్లల అక్రమ రవాణా కేసులు వెలుగులోకి వస్తున్నాయని జాతీయ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో నివేదికలు స్పష్టం చేస్తున్నాయి.

## అంబేద్కర్ అందరివాడు

(మొదటి తరువాయి)

కేంద్రమంత్రి బండి సంజయ్ పాల్గొన్నారు. కొంతమంది ఆ మహనీయుడిని దళితులకే పరిమితం చేస్తున్నారని .. కాని ఆయన భారతదేశ ప్రజలందరికి దేవుడన్నారు. అంబేద్కర్ జీవితాన్ని యువత ఆదర్శంగాతీసుకోవాలని బండి సంజయ్ సూచించారు. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ పడినన్ని అవమానాలు ఎవరు ఎదుర్కోలేదన్న కేంద్రమంత్రి వాటినే సోపానాలుగా మార్చుకొని తన చదువును దేశానికి ధారపోసిన గొప్పనేత అన్నారు. కాంగ్రెస్ పార్టీ అంబేద్కర్ ను అవమానించిందని.. ఆయనకు భారతరత్న ఇవ్వకుండా... ఎన్నికల్లో ఓడించిందన్నారు. అంబేద్కర్ చనిపోతే ఢిల్లీలో అంత్యక్రియలు చేసేందుకు అభ్యంతరం తెలిపిన కాంగ్రెస్ పార్టీ .. ఆయన పార్థివ దేహాన్ని ముంబయికి పంపి అప్పుడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ విమాన చార్జీలు వసూలు చేసిందన్నారు. అంబేద్కర్ ఆశయాలను బీజేపీ అమలు చేస్తుంటే కాంగ్రెస్ ఆయన చరిత్రను కనుమరుగు చేసేందుకు కుట్ర పన్నుతుందన్నారు. ఒకప్పుడు రిజర్వేషన్లను వ్యతిరేకించిన కాంగ్రెస్ ఓట్లకోసం ముస్లిం రిజర్వేషన్లకు కుట్ర చేసిందని కేంద్రమంత్రి బండిసంజయ్ అన్నారు.

## కేటీఆర్‌కు హైకోర్టులో ఊరట

(మొదటి తరువాయి)

ఈ కేసుకు సంబంధించి న్యాయస్థానంలో సుదీర్ఘంగా వాదనలు జరిగాయి. ఇరువైపుల వాదనలు విన్న జస్టిస్ కె.లక్ష్మణ్ బెంచ్ కేటీఆర్‌పై నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. గతంలో ప్రభుత్వం రూ.25 వేల కోట్ల కుంభకోణానికి పాల్పడిందని కేటీఆర్ వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాఖ్యలపై కాంగ్రెస్ నాయకురాలు ఆత్రం సుగుణమ్మ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అంతేకాకుండా మాజీ మంత్రి కామెంట్స్‌పై స్థానికంగా ఉన్న ఉట్నూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మూసీ ప్రక్షాళనపేరుతో కుంభకోణం చేశారంటూ కేటీఆర్ అన్నారని, ఎలాంటి ఆధారాలు లేకుండా మాజీ మంత్రి వ్యాఖ్యలు చేశారంటూ సుగుణమ్మ పోలీసులకు కంపలైంట్ చేశారు. ఈ క్రమంలోనే కేటీ-ఆర్‌పై ఉట్నూరు పోలీసులు పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ఈ కేసులను సవాల్ చేస్తూ కేటీఆర్ హైకోర్టులో పిటిషన్ చేశారు. ఉట్నూర్ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని పిటిషన్‌లో కోరారు. దీనిపై సుదీర్ఘంగా వాదనలు జరుగగా.. హైకోర్టు (సోమవారం) తుది తీర్పును వెల్లడించింది. మాజీ మంత్రి కేటీఆర్‌పై నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేస్తూ జస్టిస్ కె.లక్ష్మణ్ బెంచ్ తీర్పును వెలువరించింది.

## మజ్లిస్ కోసమే పోటీకి బీఆర్ఎస్ దూరం

(మొదటి తరువాయి)

కార్యాలయంలో నిర్వహించిన డియా సమావేశంలో కిషన్‌రెడ్డి మాట్లాడారు. కెసీఆర్‌కు తమ పార్టీ కార్పొరేటర్లపై నమ్మకం లేదని.. ఎమ్మెల్సీ ఎన్నికల ఓటింగ్‌కు వెళ్లొద్దని వారికి చెబుతున్నారన్నారు. మజ్లిస్‌తో కాంగ్రెస్ కుమ్మక్కైందని ఆరోపించారు. ఆ మూడు పార్టీల నిజస్వరూపం బయట పెట్టాలనే భాజపా పోటీ-చేస్తోందన్నారు. ఎన్నికల్లో తమ పార్టీ విజయం సాధిస్తుందని కిషన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. భారాస, కాంగ్రెస్, మజ్లిస్ పార్టీల కుమ్మక్కు రాజకీయాలను ప్రజలు అర్థం చేసుకున్నారని చెప్పారు. హైదరాబాద్ నగరంలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు పోటీ చేయకుండా మజ్లిస్‌కు అండగా నిలబడుతున్నాయని కిషన్ రెడ్డి అన్నారు. ఎన్నికైన కార్పొరేటర్‌లను ఓటు-వేయకుండా బీఆర్ఎస్ బెదిరుస్తుందన్నారు. అత్యధిక ఓట్లు ఉన్నా ఏ ప్రాతిపదికన పోటీ- చేయడం లేదో చెప్పాలన్నారు. పచ్చి మతోన్మాద, రజాకారు మజ్లిస్‌కు సపోర్ట్ చేస్తున్న ఈ రెండు పార్టీలు సెక్యులర్ పార్టీలు ఎలా అవుతాయని ప్రశ్నించారు. నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో హైదారాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ పరిధిలోని కాకార్పొరేటర్‌లతో కిషన్ రెడ్డి సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు పోటీ చేయకుండా మజ్లిస్‌కు అండగా నిలబడుతున్నాయి. ఎన్నికైన కార్పొరేటర్‌లను ఓటు వేయకుండా బీఆర్ఎస్ పార్టీ బెదిరుస్తుంది. ఇది తమకు ఓటు- వేసి గెలిపించిన ప్రజలను అవమానించడమే. ఎంఐఎం కోసం ప్రజలు కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు ఓటు వేయలేదు. బీజేపీని ఓడించేందుకు ఈ రెండు పార్టీలు పోటీ చేస్తాయి. పచ్చి మతోన్మాద, రజాకారు మజ్లిస్‌కు సపోర్ట్ చేస్తున్న ఈ రెండు పార్టీలు సెక్యులర్ పార్టీలు ఎలా అవుతాయి. సెక్యులర్ అని రాహుల్ గాంధీ ఏ ముఖం పెట్టుకుని ప్రచారం చేస్తున్నారు. మజ్లిస్ పార్టీ రజాకర్ పార్టీ అవునా కదా రాహుల్ గాంధీ చెప్పాలి.మజ్లిస్ పార్టీ మోచేతి నీళ్లు ఎందుకు తాగుతున్నారు.

## జార్ఖండ్‌లో ఎన్‌కౌంటర్

(మొదటి తరువాయి)

లుగు కొండల ప్రాంతంలో భద్రతా బలగాలకు మావోయిస్టులు ఎదురుపడ్డారు. దీంతో ఇరు పక్షాల మధ్య కాల్పులు జరిగాయి. పోలీసుల కాల్పుల్లో 8 మంది మావోయిస్టులు చనిపోయారని సీఆర్‌పీఎఫ్ అధికారులు వెల్లడించారు. మృతులను గుర్తించాల్సి ఉందని తెలిపారు. ఘటనా స్థలంలో ఎస్ఎల్ఆర్, ఇన్సాస్ రైఫిళ్లతోపాటు- భారీగా ఆయుధాలు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఆ ప్రాంతంలో కాల్పులు ఇంకా కొనసాగుతున్నాయని వెల్లడించారు. కాగా, ఈ నెల 14న జార్ఖండ్‌లోని పశ్చిమ సింఘ్‌భమ్ జిల్లాలో 11 మావోయిస్టు బంకర్లను భద్రతా బలగాలు ధ్వంసం చేసిన విషయం తెలిసిందే. సీఆర్‌పీఎఫ్, స్థానిక పోలీసులు కూంబింగ్ నిర్వహిస్తుండగా బాక్రబేదా అటవీ ప్రాంతంలో రెండు ఐఈడీలను గుర్తించారు. వాటిని బాంబు స్కాడ్ సిబ్బంది నిర్వీర్యం చేసిన విషయం తెలిసిందే.

## తెలంగాణ తెచ్చుకున్నదే ఉద్యోగాల కోసం

(మొదటి తరువాయి)

సమయం అయిపోయిందని, కాంగ్రెస్ హయాంలో నిరుద్యోగులకు పారదర్శకంగా ఉద్యోగాలు కల్పిస్తున్నామన్నారు. ఖమ్మం జిల్లా మధిరలో మెగా జాబ్ మేళా కార్యక్రమం జరిగింది. ఒకేరోజు 5 వేల మందికి ఉపాధి దక్కింది. ఉద్యోగాలు పొందిన వారికి డిప్యూటీ సీఎం భట్టి నియామకపత్రాలు అందజేశారు. మెగా జాబ్ మేళా కార్యక్రమంలో డిప్యూటీ సీఎంభట్టి విక్రమార్క మాట్లాడుతూ... 'తెలంగాణ రాష్ట్రం తెచ్చుకున్నదే ఉద్యోగాల కోసం. తెలంగాణ తెచ్చుకున్నాక ఓ కుటు-ంబానికి మాత్రమే ఉద్యోగాలు వచ్చాయి. కాంగ్రెస్ ప్రజా పాలనలో నిరుద్యోగులందరికీ పారదర్శకంగా ఉద్యోగాలు ఇస్తున్నాం. బీఆర్ఎస్ హయాంలో పేపర్ లీకేజీలతో సమయం అయిపోయింది. కాంగ్రెస్ హయాంలో నిరుద్యోగులకు పారదర్శకంగా ఉద్యోగాలు కల్పిస్తున్నాం. గత పది సంవత్సరాల్లో నిరుద్యోగులు, ఉద్యోగులు ఫలితాలు సాధించలేకపోయారు. ప్రజా ప్రభుత్వంలో మూడంచల్లో ఉద్యోగాల కల్పిస్తున్నాం. ఒకటి ప్రభుత్వ ఉద్యోగాలు, రెండు బహుళ జాతి సంస్థలకు వనరులు ఏర్పాటు చేసి రాష్ట్ర యువతకు పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు, మూడు ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు- రాజీవ్ యువ వికాసం, జాబ్ మేళాలు. 5,000 మందికి యువతకు ఉపాధి కల్పించేందుకు హైదరాబాదులో మరో నాలెడ్జ్ సిటీ- ఏర్పాటు-చేస్తున్నాం. మధిర జాబ్ మేళా ద్వారా 5,000 మందికి ఒకేరోజు ఉపాధి లభించింది. రాష్ట్ర వనరులు, రాష్ట్ర భవిష్యత్తుకు, జీడీపీ పెరుగుదలకు, కుటు-ంబానికి, సమాజానికి పెద్ద ఎత్తున యువత ఉపయోగపడాలి. ప్రతి ఆలోచన మంచిది అయితే మంచి ఫలితాలు సాధిస్తారు. యువత మత్తు పదార్థాలు, సంఘ విద్రోహశక్తులకు దూరంగా ఉండాలి. చివరి దశలో తల్లిదండ్రులు బాధపడకుండా యువత చూసుకోవాలని అన్నారు.

## తెలంగాణలో రోహిత్ వేముల చట్టం

(మొదటి తరువాయి)



సిద్దరమాయ్యకు కూడా ఇదే తరహాలో రాహుల్ లేఖ రాశారు. అయితే రోహిత్ చట్టంపై భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి స్పందించారు. రాహుల్ గాంధీ ఏం ఆలోచించినా ప్రజల కోసమే ఆలోచిస్తారని అన్నారు. రోహిత్ చట్టం తేవాలని రాహుల్ గాంధీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారని తెలిపారు. రోహిత్ చట్టంపై సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయం తీసుకుంటారని అన్నారు. గాంధీభవన్‌లో సోమవారం నాడు ఎంపీ చామల కిరణ్ మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ చేసిన తప్పులకు రజతోత్సవ సభలో తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. భారీ డైలాగులు కొట్టి కేసీఆర్ అధికారంలోకి వచ్చారని అన్నారు. కళ్లముందు జరిగిన చరిత్రను కేటీ-ఆర్ వక్రీకరిస్తున్నారని ఆరోపించారు. గాంధీ, నెల్సన్ మండేలా లాగా కేసీఆర్ ఫీల్ అవుతున్నారని విమర్శించారు.

## ఒసాకా ఎక్స్‌పోలో తెలంగాణ పెవిలియన్

(మొదటి తరువాయి)



ఏర్పాటు- చేసిన తెలంగాణ జోన్‌ను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి గారు, ఐటీ-పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు ప్రారంభించారు. ??ప్రతి ఐదేళ్లకు ఒకసారి ఒసాకో ఎక్స్ పో నిర్వహిస్తారు. ఒసాకో ఎక్స్ పోలో పాల్గొన్న మన దేశంలోని తొలి రాష్ట్రం తెలంగాణ కావటం విశేషం. ఒసాకా ఎక్స్ పో వేదికపై తెలంగాణ తన వైవిధ్యమైన సంస్కృతి, అభివృద్ధి చెందుతున్న పారిశ్రామిక అనుకూల వాతావరణం, సాంప్రదాయ కళలు మరియు పర్యాటక ఆకర్షణలను ప్రపంచం నలుమూలాల నుంచి వచ్చే సందర్శకులకు చాటిచెప్పనుంది. తెలంగాణ పెవిలియన్‌లో రాష్ట్ర సాంకేతిక పురోగతి, సాంస్కృతిక వారసత్వం, పర్యాటక సంపదను ప్రతిబింబించే ప్రదర్శనలు ఏర్పాటు- చేశారు. ఈ వేదిక ద్వారా అంతర్జాతీయ పెట్టు-బడులను ఆకర్షించడంతో పాటు-, సాంస్కృతిక సహకారాన్ని పెంపొందించే దిశగా తెలంగాణ అడుగులు వేస్తోంది.

## ప్రజాసంక్షేమం లక్ష్యంగా నిర్ణయాలు

(మొదటి తరువాయి)



దేశంలోని ఏ గ్రామం, కుటుంబం, ఒక్క పౌరుడు కూడా వెనకబడి ఉండకూడదని అర్థం. ఎన్డీయే ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు ప్రజల వెయ్యేళ్ల భవిష్యత్తుపై సానుకూల ప్రభావం చూపుతాయనడంలో సందేహం లేదన్నారు. టెక్నాలజీ పరుగులు తీస్తున్న ఈ కాలంలో పరిపాలన అంటే వ్యవస్థలను నిర్వహించడం కాదని వ్యాఖ్యానించారు. రాబోయే అవకాశాలను కూడా అంచనా వేయగలగాలని పేర్కొన్నారు. సివిల్ సర్వీసెస్ డే సందర్భంగా ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. దేశ యువత, రైతులు, మహిళల ఆకాంక్షలు నెరవేర్చుతూ ఉన్నతస్థాయికి ఎదిగేందుకు ఉపయోగపడతాయి. వారి అసాధారణ ఆకాంక్షలు నెరవేర్చ డానికి సాధారణంగా కృషి చేస్తే సరిపోదు. అంతే వేగంతో ప్రభుత్వం పని చేయాల్సి ఉంటుందని ప్రధాని పేర్కొన్నారు. టెక్నాలజీ పరుగులు తీస్తున్న ఈ కాలంలో పరిపాలన అంటే వ్యవస్థలను నిర్వహించడం కాదు. కొత్త అవకాశాలు సృష్టించడం. పథకాలు ప్రజలపై ఎంత ప్రభావం చూపుతాయనేది కీలకం. దాని ఆధారంగా నాణ్యమైన పాలన కొనసాగించడం సాధ్యమవుతుంది. ఈ పదేళ్లలో భారత్‌లో ఎన్నో మార్పులు జరిగాయి. పాలన పారదర్శకత, ఆవిష్కరణ ఇలా ఎన్నో రంగాల్లో కొత్త మార్క్‌ను నెలకొల్పుతోందని అన్నారు. 2023లో లో జీ20 భారత్ అతిథ్యమిచ్చిన సంగతి తెలిసిందే. నాడు 'జనభాగిదారి' విధానం ఈ కార్యక్రమాన్ని ప్రజా ఉద్యమంగా మార్చింది. యావత్ ప్రపంచ దృష్టి మన దేశంపై పడింది. కార్యక్రమాల్లో పాల్గొనడం మాత్రమే కాదు.. పలు కార్యక్రమాలను నడిపించే స్థాయికి మన దేశం చేరింది. అగ్రగామిగా నిలుస్తోంది. ఈసందర్భంగా సివిల్ సర్వెంట్లకు ఓ విజ్ఞప్తి చేయాలనుకుంటున్నా. పేదల సమస్యలను ఓపిగ్గా వినండి. వారితో సున్నితంగా వ్యవహరించండి. వారిని గౌరవించండి. పేదల సమస్య పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. క్షేత్రస్థాయిలో సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు.

## తెలుగు పంచాంగం 22/4/2025,మంగళవారం



**సూర్యోదయం - సూర్యాస్తమయం**
**సూర్యోదయం:** ఉదయం 5:59 AM
**సూర్యాస్తమయం:** సాయంత్రం 6:30 PM ?
**చంద్రోదయం - చంద్రాస్తమయం**
**చంద్రోదయం:** రాత్రి 1:43 AM (ఏప్రిల్ 22)
చంద్రాస్తమయం: మధ్యాహ్నం 12:16 PM
**తిథి**
**నవమి:** ఏప్రిల్ 21 సాయంత్రం 6:58 PM నుండి ఏప్రిల్ 22 సాయంత్రం 6:13 PM వరకు
దశమి: ఏప్రిల్ 22 సాయంత్రం 6:13 PM నుండి ఏప్రిల్ 23 సాయంత్రం 4:43 PM వరకు
**నక్షత్రం**
**శ్రవణం:** ఏప్రిల్ 21 మధ్యాహ్నం 12:37 Pm నుండి ఏప్రిల్ 22 మధ్యాహ్నం 12:44 PM వరకు
ధనిష్ఠ: ఏప్రిల్ 22 మధ్యాహ్నం 12:44 PM నుండి ఏప్రిల్ 23 మధ్యాహ్నం 12:07 PM వరకు ?
**అశుభ సమయాలు**
**రాహుకాలం:** మధ్యాహ్నం 3:22 PM నుండి సాయంత్రం 4:56 PM వరకు
**యమగండం:** ఉదయం 9:06 AM నుండి 10:40 AM వరకు
**దుర్ముహూర్తం:** ఉదయం 8:29 AM నుండి 9:19 AM వరకు, రాత్రి 11:05 PM నుండి 11:51 PM వరకు
వర్జ్యం: సాయంత్రం 4:38 PM నుండి 6:12 PM వరకు ?
**శుభ సమయాలు**
అభిజిత్ ముహూర్తం: మధ్యాహ్నం 11:49 AM నుండి 12:39 PM వరకు
**అమృతకాలం:** రాత్రి 1:58 AM నుండి 3:31 PM వరకు
బ్రహ్మ ముహూర్తం: ఉదయం 4:22 AM నుండి 5:10 PM వరకు ?

# గొంగిడి మహేందర్రెడ్డిని విమర్శించే స్థాయి కాంగ్రెస్ నేత కొంతం మోహన్ రెడ్డికి లేదు

**మోటకొండూర్,ఏప్రిల్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్**

డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్రెడ్డి పై మోటకొండూర్ కాంగ్రెస్ నాయకుడు కొంతం మెహన్ రెడ్డికి విమర్శలు చేసే నైతికహక్కు లేదని బీఆర్ఎస్ మండల ప్రధానకార్యదర్శి ఎగ్జిడి కృష్ణ ఆన్నారు. సోమవారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహేందర్రెడ్డిపై అసత్య ఆరోపణలు చేస్తే సహించేదిలేదన్నారు. బీర్ల అయిలయ్య బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్పై అనిచిత వ్యాఖ్యాలు చేసింది వాస్తవం కాదా... గొంగిడి మహేందర్రెడ్డి చేసిన వ్యాఖ్యలు వాస్తవమైనవేనని, అట్టి విషయం మాజీ కాంగ్రెస్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్ననే తెలియజేశాడని అది నిజంకాదా అని అన్నారు. మెహన్రెడ్డి మీ భార్య గ్రామ సర్పంచ్ గా ఉన్న సమయంలో రూ.10లక్షలు అవినీతి చేస్తే



పాలకవర్గం అవిశ్వాసం పెడితే పదవి పోకుండా బీఆర్ఎస్ ఎమ్మెల్యేల, మంత్రిల కాళ్లు మోకింది వాస్తవం కాదా అని గుర్తుచేశారు. వంగపల్లి పీఏసీఎస్లో అవినీతి జరిగిందని తమరు చెప్పడం విడ్డూరంగా ఉందని, కనీసం అవగాహన లేని మాటలు మాట్లాడం మానుకోవాలని హెచ్చరించారు. భూ కబ్జాలకు కాంగ్రెస్ పార్టీ నిలయంగా మారిందని ఆరోపించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఎండీ బురాన్, అనంతుల జంగారెడ్డి, పన్నాల అంజిరెడ్డి, జివిలికపల్లి వెంకటేశ్, దడిగే మధు, కాదూరి ఎల్లేందర్, కొంపల్లి పరుశరాములు, నల్ల జహాంగీర్, బొట్ల నవీన్ తదితరులు ఉన్నారు.

# తెలుగుదేశం సభ్యత్వ కార్డుల పంపిణీ

**ఆమనగల్లు, ఏప్రిల్ 21(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

ఆమనగల్లు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సోమవారం తెలుగుదేశం పార్టీ కల్వకుర్తి నియోజకవర్గం మాజీ ఇంచార్జ్, నాగర్ కర్నూల్ అడ్ హా కమిటీ సభ్యులు, ప్రముఖ సీనియర్ న్యాయవాది అండేకార్ యాదిలాల్ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వం కార్డులను పంపిణీ చేశారు. టిడిపి సభ్యత్వం నమోదు చేసుకున్న వారికి రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యాలయం నుండి జాతీయ పార్టీ అధ్యక్షులు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఆదేశాల మేరకు సభ్యత్వ నమోదు కార్డులు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా యాదిలాల్ మాట్లాడుతూ తెలుగుదేశం సభ్యత్వం కార్డుల ప్రాముఖ్యత ప్రమాదంలో చనిపోయిన వారు ఎవరైనా ఉంటే వారికి ఐదు లక్షలు బీమా వర్తించే విధంగా చంద్రబాబు నాయుడు లోకేష్ చర్యలు చేపట్టారని పేర్కొన్నారు. టిడిపి సభ్యత్వం తీసుకొని పార్టీని నమ్ముకున్న కార్యకర్తలకు బీమా సౌకర్యాన్ని ఏర్పాటు చేసిన ఘనత



తెలుగుదేశం పార్టీకే దక్కుతుందని తెలిపారు. ప్రజల కష్టాలను చూసి తెలుగుదేశం పార్టీని స్థాపించిన మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు దేశంలోనే సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిన ఘనత ఎన్టీఆర్ కే దక్కుతుందని ఆయన పేర్కొన్నారు. పెన్షన్ పథకాన్ని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తొలిసారిగా ఏర్పాటు చేసి బడుగు బలహీన, హరిజన, గిరిజన వర్గాలకు చేయూతను అందించారని తెలిపారు. భవిష్యత్తులో తెలంగాణ రాష్ట్రంలో టిడిపి జెండా ఎగరడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. తెలుగుదేశం పార్టీతోనే పేదలకు సంక్షేమ పథకాలు అందుతాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూల్ అడ్ హా కమిటీ సభ్యులు వజ్ర లింగం తిమ్మయ్య, మాజీ ఎంపీటీసీ సత్తయ్య, నాయకులు కాలె శివ, జగన్, మహేష్, నిజ లింగప్ప తదితరులున్నారు.

# మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్య



**హైదరాబాద్, ఏప్రిల్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

ఆర్థిక సమస్యలు ఓ కుటుంబాన్ని అనాథలుగా చేశాయి. నాగోల్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న మహిళా కానిస్టేబుల్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ ఘటన రాచకొండ కమిషనరేట్ పరిధిలోని మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఆల్మాస్‌గూడ సమీపంలోని టీచర్స్ కాలనీలో నివాసముండే అకుల దీపిక (38), 2018 బ్యాచ్ మహిళా కానిస్టేబుల్‌గా నగోల్ పోలీస్ స్టేషన్‌లో సిసిటీఎన్ఎస్ డ్యూటీలో పనిచేస్తున్నారు. సోమవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఇంట్లో ఒంటరిగా ఉన్న దీపిక ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డారు. సమాచారం అందుకున్న మీర్‌పేట్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. దీపిక భర్త రవికుమార్ కిరాణా షాపు నడుపుతున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఒకరు ఇంటర్ చదువుతుండగా, మరొకరు పదో తరగతిలో చదువుతున్నాడు. ఆర్థిక ఇబ్బందులే ఆమె జీవితానికి గండికొట్టినట్లు భావిస్తున్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ప్రస్తుతం పరిస్థితి ప్రశాంతంగా ఉందని పోలీసులు తెలిపారు.

# అన్నదానం మహాదానం

**-శివ మారుతి గీతా అయ్యప్ప మందిరంలో కల్పవృక్ష ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి సోమవారం అన్నదానం**
**-అన్నదాన కార్యక్రమం ప్రారంభించిన దాస క్రిష్ణయ్య**




**షాద్ నగర్, ఏప్రిల్ 21(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

అన్నదానం మహాదానమని దాస కృష్ణయ్య అన్నారు. షాద్ నగర్ కల్పవృక్ష ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. అన్ని దానాలలో అన్నదానం ఎంతో గొప్పదని అన్నం పరబ్రహ్మ స్వరూపం అని అన్నారు. ప్రతి సోమవారం శివమారుతి గీత అయ్యప్ప మందిరం లో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్న నిర్వాహకులు నాగిళ్ల కుమారస్వామికి కృతజ్ఞతలు తెలిపారు . ఈ అన్నదాన కార్యక్రమాన్ని అందరూ సద్వినియం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కల్పవృక్ష ఫౌండేషన్ నిర్వాహకులు నాగిళ్ళ కుమార్, మాజీ కౌన్సిలర్ రేటికల్ నందీశ్వర్, జి. మల్లికార్జున్, ఆర్.ఎన్. రాజు, మొగి శ్రీధర్ శ్రీనాథ్, పాండు, దేవదాస్, సుమంత్, మల్లేష్, క్రాంతి కుమార్, దేవాలయం మేనేజర్ రాజగోపాల్ పాల్గొన్నారు.

# మృతుడికి నివాళులు అర్పించినమాజీ మంత్రి



**వనపర్తి ఏప్రిల్ 21( నీలగిరి ఎక్స్ ప్రెస్):**

వనపర్తి పట్టణం 16 వ వార్డు కి చెందిన మధు సుధన్ తండ్రి సదుర్లానరసింహ మరణించడం జరిగింది. సోమవారం మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి వారి ఇంటికి వెళ్లి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులకు మనోధైర్యం చెప్పినారు.వనపర్తి పట్టణం కి చెందిన సర్దార్ ఖాన్ కి ఆక్సిడెంట్ కావడం జరిగింది . ఇట్టి విషయం తెలుసుకొని వారి ఇంటికి వెళ్లి పరామర్శించిన మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి మాజీ మంత్రివెంట వాకిటీ శ్రీధర్ రమేష్ గౌడ్ జోహేబ్ హుస్సేన్ ఆరిఫ్ ఏకే పాషా సాదిక్ పట్టణ ఉపాధ్యక్షుడు మోహన్ లక్ష్మణ్ గౌడ్ శివ గౌడ్ పాల్గొన్నారు.


# సిఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

**కోడేరు, ఏప్రిల్ 21(నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

కోడేరు మండలం నర్సాయపల్లి గ్రామానికి చెందిన ఎజ్జు అలివేలకు సీఎం సహాయ నిధి నుంచి 60,000 రూపాయల విలువైన చెక్కు మంజూరు చేయబడింది. ఈ చెక్కును మంత్రి జూపల్లి కృష్ణారావు సహకారంతో, మాజీ ఎంపీపీ కొత్త రామ్మోహన్ ఆదేశాల మేరకు, మాజీ సింగిల్ విండో చైర్మన్ నాగారం కొండల్ రావు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తాళ్ల వేణుగోపాలస్వామి, గంగపుత్ర సంఘం అధ్యక్షుడు బయ్య నాగరాజు, కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి తాళ్ల హనుమంతు, తాళ్ల బాలస్వామి, బిక్షపతి, దేశమోని సత్యనారాయణ, సుదర్శన్ గౌడ్, బయ్య కేశవులు, తాళ్ల కృష్ణయ్య, ఏదుట్ల వెంకటస్వామి, కుమ్మరి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# నందిగామలో గ్రంథాలయం మంజూరు చేయండి

**-జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్ రెడ్డికి ఎమ్మెల్యేతో కలిసి వినతి పత్రం ఇచ్చిన నందిగామ మండల నాయకులు**



**నందిగామ, ఏప్రిల్ 21(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

మండల కేంద్రమైన నందిగామలో గ్రంథాలయం ఏర్పాటు చేయాలని జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డికి సోమవారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తో కలిసి స్థానిక మండల నాయకులు వినతి పత్రం అందజేశారు. కొత్తగా మండలం ఏర్పడి ఏళ్లు గడుస్తున్నా నందిగామలో గ్రంథాలయ ఏర్పాటు చేయకపోవడం శోచనీయమన్నారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్ ను కలిసిన వారిలో మాజీ ఎంపీపీ ఎం శివశంకర్ గౌడ్, మాజీ ఎంపీటీసీలు కొమ్ము కృష్ణ, చంద్రపాల్ రెడ్డి, దేపల్లె కుమార్ గౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జంగ నరసింహులు, చించేటి కృష్ణ గౌడ్, తడకల జంగయ్య స్థానిక నాయకులు తదితరులు ఉన్నారు.

# ద్విచక్ర వాహనంపై 11.150 కేజీలు ఎండు గంజాయి పట్టివేత

**భద్రాచలం ఏప్రిల్ 21(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

భద్రాచలంలో గత రెండు రోజులుగా ఖమ్మం ఎన్ఫోర్స్మెంట్ అధికారులు నిర్వహిస్తున్న దాడులలో భాగంగా భద్రాచలం ఆర్టీఏ చెక్ పోస్ట్ వద్ద ద్విచక్ర వాహనంపై ఎండు గంజాయిని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్న అధికారులు. ఒక మోటార్ సైకిల్ (11.150) కేజీల ఎండు గంజాయిని మరియు ఒక సెల్ ఫోన్ను ఒక ద్విచక్ర వాహనం ను స్వాధీన చేసుకున్న అధికారులు.

## ఫీల్డ్ అసిస్టెంట్ల పెండింగ్ వేతనాలు చెల్లించాలి




**భువనగిరి,ఏప్రిల్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
భువనగిరి మునిసిపాలిటీ రాయగిరి నుంచి జిల్లా వ్యాప్తంగా ఫీల్డ్ అసిస్టెంట్లు కలెక్టరేట్ వరకు ర్యాలీ చేపట్టారు. తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ వరకు చేరుకొని ధర్నా చేపట్టారు. గత కొన్ని నెలలుగా జీతాలు రాక కుటుంబాలను పోషించడం చాలా కష్టతరంగా ఉందన్నారు. దయచేసి తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు.

## విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నాం

**-షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**



**షాద్ నగర్, ఏప్రిల్ 21(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నాము అని షాద్ నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. ఈ రోజు కొందుర్గ్ మండల కేంద్రంలో 1.20 కోట్ల అంచనా వ్యయం తో నిర్మించే శాఖా గ్రంథాలయం భవనకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...నిత్యం గ్రంథాలయానికి వెళ్లడం ద్వారా గల్లీ నుంచి ఢిల్లీ వరకు జరిగే అన్ని రకాలు విశేషాలు అవగతమవుతాయన్నారు. నిరుద్యోగులు పోటీ పరీక్షలకు సన్నద్ధమమేందుకు గ్రంథాలయాలు ఉపయోగపడతాయని తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ..జిల్లాలో అన్ని పెద్ద గ్రామాల్లో గ్రంథాలయాలు మంజూరు చేయుటకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ముఖ్య నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..

## రాజనగరం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వంశీ మాజీ మంత్రి ఆధ్వర్యంలో బీ ఆర్ యస్ పార్టీలో చేరిక



**వనపర్తి ఏప్రిల్ 21 ( నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
సోమవారం వనపర్తి పట్టాను రాజనగరం 12 వ వార్డు చెందిన యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వంశీ మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆధ్వర్యంలో టిఆర్ఎస్ పార్టీలో చేరినాడు. నిరంజన్ రెడ్డి ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించి శుభాకాంక్షలు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు రమేష్ గౌడ్ అధికార ప్రతినిధి శ్రీధర్ గొర్రెల కాపరుల మాజీ జిల్లా అధ్యక్షుడు పందెం కురుమూర్తి యాదవ్ మార్కెట్ డైరెక్టర్ విజయకుమార్ మీడియా జిల్లా కన్వీనర్ నందిమల్ల అశోక్,పార్టీ అధ్యక్షులు అంజయ్య సింగిల్ విండో వైస్ చైర్మన్, బాలచంద్రయ్య యాదవ్ యూత్ అధ్యక్షులు కరుణాకర్ కుమ్మరి సత్తయ్య బండి చంద్రయ్య టౌన్ పార్టీ ఉపాధ్యక్షులు బుచ్చిబాబు కాటమను బాలస్వామి కందుర్ వెంకటేష్ బాలస్వామి జీప్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

**- కాయితి విజయకుమార్ రెడ్డి**



**కల్వకుర్తి,ఏప్రిల్ 21(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కల్వకుర్తి మండల పరిధిలోని నేడు ఉదయము 8:30 గంటలకు కల్వకుర్తి మండల పరిధిలోని ఎల్లికల్ గ్రామంలో అంబేద్కర్ రాజ్యాంగ పరిరక్షణ మరియు గాంధీ శాంతి సందేశం ప్రజలందరికీ మరియు గడపగడపకు చేరవేయడమే లక్ష్యంగా జై బాబు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమాన్ని గడపగడపకు వెళ్లి వివరించడానికి పాదయాత్ర నిర్వహించడం జరుగుతుంది కావున కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు యువజన కాంగ్రెస్ నాయకులు మరియు ఎన్ఎస్యుఐ,ఎస్సీ సెల్,ఎస్టీ సెల్,బీసీ సెల్,మహిళా సెల్ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కల్వకుర్తి కాంగ్రెస్ పార్టీ బ్లాక్ అధ్యక్షుడు కాయితి విజయ్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు.

## రైతులు సేద తీరేందుకు నీడ,నీరు ఏర్పాటు చేయాలి

**-వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభంలో ఎమ్మెల్యే**



**గోపాలపేట,ఏప్రిల్ 21 ( నీలగిరి ఎక్స్ ప్రెస్):**
గోపాలపేట మండల కేంద్రంలో మహిళా సమైక్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని, కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు సేద తీరేందుకు నీడ, నీరు ఏర్పాటు చేయాలన్నారు.తేమ శాతంతగ్గి వచ్చిన వెంటనే వడ్లను కొనుగోలు చేయాలంటూ నిర్వాహకులకు ఎమ్మెల్యే సూచించారు.కార్యక్రమంలో తహసిల్దార్ తిలక్ రెడ్డి, డిపిఎం భాష, సత్యశీలరెడ్డి, కోటిరెడ్డి, శివన్న, కొంకి వెంకటేష్, గోపాల్, రాజు, మహిళా సమైక్య సభ్యురాలు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పాఠకులకు గమనిక:




మీరు ఎదుర్కొంటున్న సమస్యలను వివరణాత్మకంగా మాకు తెలియజేయండి. ప్రభుత్వ అధికారుల మరియు ప్రజల మధ్య వారధిగా నిలిచి, మా ప్రత్యేక విలేకరుల బృందం సంబంధిత అధికారులను సంప్రదించి, పరిష్కారం కోసం కృషి చేస్తుంది.
నిజం బయటకి తీయటం కోసం, నిజాయితీ కోసం నీలగిరి ఎక్స్ ప్రెస్ న్యూస్ సంప్రదించండి.
అన్ని వేళాల మీతో పాటు ఉంటుంది.
ఈమెయిల్: neelagiriexpress@gmail.com
సంప్రదింపు నెంబర్: 9705770909
మీ ప్రతిభావంతమైన భాగస్వామ్యంతో సమాజానికి మంచి మార్పు తీసుకురావడం మా లక్ష్యం.

**మీ గొంతుకకు మేమే వేదిక - నీలగిరి ఎక్స్‌ప్రెస్!**

# ప్రైవేటు టీచర్లకు టార్గెట్లు

-కాన్వసింగ్ పేరుతో గల్లీల్లో ఇంటింటి ప్రచారాలు
-ప్రచారాలు ఘణం, సౌకర్యాలు శూన్యం.
-ఉదయం నుండి మధ్యాహ్నం వరకు కాన్వసింగ్ పేరుతో ఎండలో తిప్పుతున్న యాజమాన్యం
-గత సంవత్సరం ఎండలో కాన్వసింగ్ చేయడం వల్ల ఒక టీచర్ మృతి

**షాద్ నగర్, ఏప్రిల్ 21(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
షాద్ నగర్ పట్టణంలో గల్లీకొక ప్రైవేటు స్కూల్ చొప్పున సుమారు 100కు పైగా ఉన్నాయి. ధనార్జనే ధ్యేయంగా కొన్ని ప్రైవేటు స్కూల్స్ టీచర్లకు టార్గెట్లు ఇచ్చి మరి ఉదయం 9 గంటల నుండి 12 గంటల వరకు ఎండలో పట్టణం అంతటా తిప్పుతున్నారు. ఉదయం 8 నుండే మండే ఎండలు ఉండటంతో




టీచర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మధ్యతరగతి దిగువ మధ్య తరగతి నుండి వచ్చిన టీచర్లు యాజమాన్యం భయానికి గల్లి గల్లి తిరిగి స్కూల్స్ కోసం ప్రచారం చేస్తున్నారు. రంగురంగుల ప్రచార కరపత్రాలపై మాత్రమే వసతులు ఉంటాయి. స్కూళ్ల ఆవరణలో మాత్రం ఎలాంటి కనీస వసతులు లేని స్కూల్స్ చాలా ఉన్నాయి. పట్టణంలో ఉన్న ప్రైవేటు పాఠశాలల్లో కొన్నింటిని మినహాయిస్తే చాలా స్కూల్స్ ఇదే తతంగాన్ని నడుపుతున్నాయి. కాన్వసింగ్ పేరుతో క్లాస్ రూముల్లో విద్యను బోధించే టీచర్లను పట్టణ రోడ్లపై తిప్పుతున్నారు. టీచర్లను ప్రచారానికి తిప్పుతున్న స్కూల్స్ పై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

# వరి ధాన్యం సగటు నాణ్యత , నిబంధనలకు విరుద్ధంగా వరి కోతలు కోసే వారిపై చర్యలు

**-జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ వెంకటేశ్వర్లు**


**వనపర్తి,ఏప్రిల్ 21 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
వరి ధాన్యం సరసమైన సగటు నాణ్యత నిబంధనలకు విరుద్ధంగా కోతలు చేసే వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని అదనపు కలెక్టర్ రెవెన్యూ జి. వెంకటేశ్వర్లు హార్వెస్టర్లను సూచించారు. జిల్లాలో వరి కోతలు విస్తృతంగా కోనసాగుతున్న తరుణంలో సోమవారం మధ్యాహ్నం ఐ.డి. ఒ .సి సమావేశ హాలో హార్వెస్టర్లు, వ్యవసాయ విస్తీర్ణాధికారులు, మిల్లర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఇటీవల కొనుగోలు కేంద్రాలు సందర్శించినప్పుడు చాలా చోట్ల వరిలో తాలు, మట్టి, గడ్డి ఎక్కువగా కనిపిస్తుందని అందుకే కోతలు ఎలా ఎప్పుడు చేయాలి సరసమైన సగటు నాణ్యత (ఎఫ్. ఎ.క్యూ ) నిబంధనలు ఏమున్నాయి అనేదానిపై జిల్లాలోని కోత యంత్రాలు నిర్వాహకులు, యజమానులు, మిల్లర్లు, వ్యవసాయ విస్తీర్ణాధికారులతో అవగాహన సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వరి చేను కోతకు



వచ్చినప్పుడే కోతలు చేపట్టాలని, పక్వానికి రాకముందే కోస్తే పచ్చగా తాలు ఏర్పడుతుందన్నారు. కోత యంత్రాలు వరి చేను కోసేటప్పుడు 19-20 ఆర్.పి.యం పెట్టాలని, బ్లోయర్ ఆన్ లో పెట్టుకొని గేర్ స్పాట్ ఏ2-బి1 లో పెట్టీ కోతలు చేపట్టాలని ఆదేశించారు. ఈ ప్రమాణాలను పాటిస్తేనే సరసమైన సగటు నాణ్యత నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యం వస్తుందని తెలియజేశారు. జిల్లాలో నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేసేందుకు అందరూ సహకరించాలని సూచించారు. నాణ్యత లేని ధాన్యం కొనడం కష్టమని, అందుకే నాణ్యత పాటించాలని సూచించారు. నిబంధనలు పాటించని హార్వెస్టర్లపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, నాణ్యతతో వచ్చే ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి 48 గంటల్లో రైతుల ఖాతాలో డబ్బులు జమ చేయడం జరుగుతుందన్నారు. ఈ విషయమై వ్యవసాయ విస్తీర్ణాధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులకు, హార్వెస్టర్లకు అవగాహన కల్పించాలని లేని పక్షంలో ఆర్.టి. ఒ కు ఫిర్యాదు చేస్తే యంత్రాలు సీజ్ చేస్తారని ఆదేశించారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోవింద్ నాయక్, ఆర్.టి. ఒ మానస, జిల్లా సివిల్ సప్లై అధికారి విశ్వనాథ్, వ్యవసాయ మండల, క్లస్టర్ అధికారులు, డి.యం., మిల్లర్లు, హార్వెస్ట్ నిర్వాహకులు, యజమానులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో ప్రధానోపాధ్యాయుడు మృతి

**ంవెల్దండ,ఏప్రిల్ 21( నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
వెల్దండ మండల శివారులో గల జరిగిన రోడ్డు ప్రమాదంలో తెల్కంపల్లి మండల లోని జడ్పిహెచ్ఎస్ ఉన్నత పాఠశాల లో ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న పాపి శెట్టి శ్రీనివాసులు( 61) కారు ప్రమాదంలో.దుర్మరణం చెందారు వివరాల్లోకి వెళితే అచ్చంపేట మండల కేంద్రానికి చెందిన పాపి శెట్టి శ్రీనివాసులు తెల్కంపల్లి ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్నారు సోమవారం ఉదయం విధులు హాజరు కావడానికి తన కారులో హైదరాబాద్ నుండి తెల్కంపల్లి కి విధులలో హాజరయ్యే క్రమంలో వెల్దండ సమీపంలో కారు కల్వర్టుకు వేగంగా ఢీకొట్టింది ప్రమాదాన్ని



స్థానికులు గమనించి అంబులెన్సులో పాపి శెట్టి శ్రీనివాసులు ను.కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు ఈ నెలాఖరులో పదవి విరమణ చేయవలసి ఉండగా వేసవి సెలవుల కారణంగా 17 న పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థులు సమక్షంలో పదవి విర మణ కార్యక్రమాలు జరుపుకున్నారు ప్రస్తుత విధులకు హాజరు కావడానికి వస్తు ప్రధానోపాధ్యాయుడు కారు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడంతో నాగర్ కర్నూల్ జిల్లా డీఈఓ రమేష్ పలువురు ఉపాధ్యాయులు కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకొనని నివాళులు అర్పించారు మృతిని కి భార్య కుమార్తె ఉన్నట్లు సమాచారం ఈ కేసును వెల్దండ ఎస్సై కురుమూర్తి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# అకాల వర్షానికి అపార నష్టం





- తీవ్రంగా నష్టపోయిన రైతులు
-ఈదురు గాలులకు కొట్టుకుపోయిన డైరీ ఫామ్ ల షెడ్లు
-రోడ్ల మీద అడ్డంగా పడిపోయిన భారీ చెట్లు..



**గోపాలపేట,ఏప్రిల్ 21( నీలగిరి ఎక్స్ ప్రెస్):** గోపాలపేట మండలంలోని వివిధ గ్రామాలల్లో ఆదివారం సాయంత్రం ఈదురు గాలులకు, వర్షాలకు రైతులు తీవ్రంగా నష్టపోయారు.బుద్ధారం గ్రామానికి చెందిన ఎల్లాల సత్యం అనే రైతు తన వ్యవసాయ పొలంలో డైరీ ఫార్మ్ కోసం ఏర్పాటుచేసిన రేకుల షెడ్డు రేకులన్నీ మొత్తం లేచిపోయి వ్యవసాయ పొలంలో పడింది..డైరీ ఫామ్ షెడ్డు కూలిపోవడంతో 3 లక్షల. ఆస్థి నష్టం జరిగింది.లక్ష్మీ దేవి పల్లి గ్రామంలో పిడుగుపాటుకు గొర్రెలు మృతి చెందాయి..బాధితుడు 2లక్షల వరకు నష్టం వాటిల్లిందని వాపోయాడు.అదేవిధంగా ఐకెపి ఆధ్వర్యంలో సింగిల్ విండో ఆధ్వర్యంలో వరి ధాన్యాన్ని ప్రభుత్వానికి అమ్మడానికి ఆరబోసుకోవడంతో అకాల వర్షానికి ధాన్యం తడిసి రైతులు నష్టపోయారు... రోడ్ల మీద భారీ చెట్లు వేర్లతో సహా అడ్డంగా పడిపోయాయి... ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు మొరపెట్టుకుంటున్నారు.

# చెట్టు = అమ్మ
# చెత్త = రోగం

చెట్టు మన జీవితానికి అమ్మంత ప్రాముఖ్యమైనది. అది మనకు ప్రాణవాయువును అందిస్తుంది, ప్రకృతిని సంరక్షిస్తుంది, మన శ్రేయస్సుకు తోడ్పడుతుంది. చెట్టు ఉంటే జీవితం ఉందని చెప్పడం అసత్యం కాదు. మరోవైపు, చెత్త అనేది రోగాలకు కారణమవుతుంది. చెత్త ఎక్కడైతే పేరుకుపోతుందో అక్కడ పర్యావరణం కలుషితమవుతుంది, నీరు, గాలి, నేల నాశనం అవుతాయి.

**చెట్టు ఎలా అమ్మలా ఉంటుంది:**
-మనకు ఆక్సిజన్ అందిస్తుంది.
-నీడ, చల్లదనం, ఆహారం, చెక్క, ఔషధాలు అందిస్తుంది.
-ప్రకృతి మనుగడలో కీలక పాత్ర పోషిస్తుంది.

**చెత్త ఎలా రోగంగా మారుతుంది:**
-చెత్త పేరుకుపోతే దోమలు, చీమలు, బ్యాక్టీరియా పుట్టుక.
-కాలుష్యం వల్ల శ్వాసకోశ, నీరు మరియు ఆహారానికి సంబంధించిన రోగాలు.

చెట్టు మన జీవితానికి అమ్మవంటిది. అందుకే మనం చెట్లను నాటాలి, వాటిని కాపాడాలి.
చెత్త మన జీవనానికి రోగం. అందుకే చెత్తను తగ్గించాలి, పునర్వినియోగం చేయాలి, పర్యావరణాన్ని స్వచ్ఛంగా ఉంచాలి.

"ప్రకృతిని ప్రేమిద్దాం, జీవనాన్ని కాపాడుకుందాం!"
మీ నరేష్ దండు సామాజిక కార్యకర్త

## జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమం విజయవంతం



**వెల్దండ, ఏప్రిల్ 21(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
వెల్దండ మండల పరిధిలోని కుప్పగండ్ల గ్రామంలో ఏఐసీసీ పిలుపు మేరకు "జై బాపు జై భీమ్ జై సంవిధాన్" కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మోతిలాల్ నాయక్, సింగిల్ విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్య గౌడ్, ఇతర కాంగ్రెస్ నాయకులు హాజరయ్యారు. మోతిలాల్ నాయక్ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ మహాత్మా గాంధీ, అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్తూ రాజ్యాంగ పరిరక్షణ కోసం కృషి చేస్తోందని తెలిపారు. అయితే, బిఆర్ఎస్, బిజెపి పార్టీలు రాజ్యాంగాన్ని అవహేళన చేస్తూ దేశంలో అరాచక పాలనకు ప్రోత్సాహం అందిస్తున్నాయని విమర్శించారు. బిజెపి ప్రభుత్వం అరాచక పాలనకు బీజం వేసిందని, బిఆర్ఎస్ పార్టీ కూడా అదే దారిలో నడుస్తోందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, ఫ్రీ బస్సు సౌకర్యం, రూ. 500కి గ్యాస్ సిలిండర్, సన్న బియ్యం పథకం, ఇందిరమ్మ ఇల్లు, రాజీవ్ వికాస పథకం, కొత్త రేషన్ కార్డులు వంటి పథకాలు బలహీన వర్గాలకు మేలు చేస్తాయని పేర్కొన్నారు. అయితే, బిఆర్ఎస్, బిజెపి పార్టీలు ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు చేయడం సిగ్గుచేటని అన్నారు. ఈ కార్యక్రమంలో పర్వత్ రెడ్డి, నాగర్ కర్నూల్ జిల్లా సేవాదళ్ ఉపాధ్యక్షుడు కొయ్యల పుల్లయ్య, గ్రామ నాయకుడు వెంకట్ రెడ్డి, గ్రామస్తులు శివరాజు, రమేష్, మహిళలు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## 26 వేల రూపాయల లంచంతో పట్టుబడ్డ చిల్పూర్ ఆర్ఐ

-ఏసీబీ చేతికి చిక్కిన వినీత్ కుమార్
-జనగాం జిల్లా లోని తహశీల్దార్ కార్యాలయంలో అవినీతి వలయాలు బట్టబయలు



**జనగాం, ఏప్రిల్ 21 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** రైతు భూమి బావుటా మార్పునకు నామమాత్రపు పని అని భావించినా, తహశీల్దార్ కార్యాలయంలో నడుస్తున్న అవినీతి వ్యవస్థ ఇంకోసారి బయటపడింది. చిల్పూర్ తహశీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ) వినీత్ కుమార్ రూ. 26,000 లంచం తీసుకుంటుండగా మంగళవారం ఏసీబీ అధికారులకి రెడ్ హ్యాండెడ్‌గా చిక్కాడు. వివరాల్లోకి వెళితే ఒక రైతు భూమికి సంబంధించి బావుటా మార్పు కోసం చేసిన దరఖాస్తును దాదాపు నెలల తరబడి పెండింగ్‌లో ఉంచిన ఆర్ఐ వినీత్ కుమార్, సమస్య పరిష్కరించాలంటే రూ. 26,000 ఇవ్వాలని బాధితుడిని డిమాండ్ చేశాడు. వేధింపులకు అల్లాడిన బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వారి సూచనల మేరకు . ఏర్పాటు చేసిన ఉక్కుపొంగు జాలంలో ఆర్ఐ చిక్కుకున్నాడు. చిల్పూర్ తహశీల్దార్ కార్యాలయంలోనే మంగళవారం మధ్యాహ్నం ఈ ఘటన చోటుచేసుకుంది. లంచం తీసుకుంటున్న సమయంలో ఏసీబీ అధికారులు అక్కడికి చేరుకుని, లొంగిన నోట్లతో పాటు ఆయన్ని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు. ప్రభుత్వ ఉద్యోగులచే నడిపించే సర్వీసులు ప్రజలకు సులభంగా అందాలన్న ఆశయాన్ని అవినీతి బుగ్గిపాలు చేస్తున్న సందర్భాల్లో ఇది తాజా ఉదాహరణ. ఈ వ్యవహారం జిల్లాలో కలకలం రేపింది. ప్రజలు కూడా ఇలా భయపడకుండా అవినీతిని అడ్డుకునేందుకు అధికార యంత్రాంగానికి సమాచారం అందించాలని ఏసీబీ అధికారులు పిలుపునిచ్చారు.

## రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ సేవలు ప్రశంసనీయం



**కడ్తాల్, ఏప్రిల్ 21(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కడ్తాల్ మండలంలో రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని కడ్తాల్ మాజీ ఎంపీపీ ఆనంద్ మాజీ సర్పంచ్ లక్ష్మీనరసింహారెడ్డి మాజీ ఉపసర్పంచ్ రామకృష్ణ నర్సింహా లు అన్నారు. సోమవారం ట్రస్ట్ ఆధ్వర్యంలో నడుస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని సందర్శించి భోజనాన్ని వడ్డించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ సేవలు ప్రశంసనీయమని కొన్ని ఆడారు. మండలంలో పేదవాడికి ఏ సమస్య వచ్చినా రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ఆదుకోవడంలో ముందు వరుసలో ఉంటుందని తెలిపారు. పేద ప్రజలకు రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ అందిస్తున్న సేవలను ప్రతి ఒక్కరు ఉపయోగించుకోవాలని తెలిపారు.

# పిల్లలకో పండుగలా పోషణ పక్షం

-గొట్టిముక్కల అంగన్వాడీ కేంద్రంలో అన్నప్రాసన, అక్షరాభ్యాసం కార్యక్రమాలు



**దేవరకొండ, ఏప్రిల్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
దేవరకొండ మండలంలోని గొట్టిముక్కల గ్రామ అంగన్వాడీ కేంద్రంలో సోమవారం ఐసిడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో పోషణ పక్షం కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆరు నెలలు నిండిన ముగ్గురు చిన్నారులకు వైభవంగా అన్నప్రాసన నిర్వహించగా, మూడు సంవత్సరాలు నిండిన బాలుడికి అక్షరాభ్యాసం చేశారు. గ్రామానికి చెందిన పిరాటి నిహాన్, కడారి పాప, గంగలి మోక్షిత్ లకు అన్నప్రాసనం జరగగా, కడారి అక్షరకు అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లులకు సిరిధాన్యాలు, చిరుధాన్యాలలో ఉండే పోషక విలువలపై వివరంగా అవగాహన కల్పించారు. శిశు ఆరోగ్యానికి, మాతృఆరోగ్యానికి సరైన పోషణ ఎంత ముఖ్యమో వివరించడంతోపాటు, వాటిని వంటల్లో ఎలా వినియోగించాలో చూపించారు. అలాగే అంగన్వాడీ కేంద్రాల్లో నిర్వహించే ప్రీస్కూల్ సంసిద్ధత కార్యక్రమాలపై, ఆటపాటల ద్వారా విద్యాబోధన కీలకతపై తల్లులకు స్పష్టతనిచ్చారు. కార్యక్రమంలో సూపర్వైజర్ డి. చిట్టెమ్మ, ప్రాథమిక పాఠశాల హెడ్‌మాస్టర్ కె. సరిత, ఏఎన్ఎమ్ జి. చంద్రకళ, అంగన్వాడీ టీచర్లు పద్మ, అలివేలు, వనితలు పాల్గొన్నారు. గ్రామస్థులు, గర్భిణులు, బాలింతలు సైతం కార్యక్రమాన్ని ఉత్సాహంగా అనుసరించారు. చిన్నారుల ఆరంభ జీవనానికి అంగన్వాడీ కేంద్రాలు అండగా నిలుస్తున్నాయని, ఇలా ప్రతి గ్రామంలో కూడా పోషణపై ప్రజల్లో మరింత అవగాహన పెరగాలంటూ వారు ఆకాంక్షించారు.

## ఫీల్డ్ అసిస్టెంట్ల పెండింగ్ వేతనాలను తక్షినమే చెల్లించాలి



**నాగర్ కర్నూల్, ఏప్రిల్ 21(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం ఫీల్డ్ అసిస్టెంట్లు యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ అడ్మిన్ ఆఫీసర్ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. జిల్లాలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు మూడు నెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే విడుదల చేయాలని కోరారు. అదేవిధంగా, 4 779 జీవోను రద్దు చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు వేమన వెంకటస్వామి, పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

## భారత వాయుసేన హెలికాప్టర్ అత్యవసర ల్యాండింగ్.. ఎందుకంటే..!



**ఖమ్మం ఏప్రిల్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
భారత వాయుసేనకు చెందిన ఓ హెలికాప్టర్‌ను పైలెట్ అత్యవసరంగా ల్యాండ్ చేశారు. ప్రతికూల వాతావరణం కారణంగా హెలికాప్టర్‌ను అత్యవసరంగా కిందకు దించినట్లు భారత వాయుసేనకు చెందిన విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. గుజరాత్ రాష్ట్రం జామ్‌నగర్ జిల్లాలోని రంగ్‌మతి డ్యామ్ సమీపంలోగల చెంగా గ్రామంలో హెలికాప్టర్ ఎమర్జెన్సీ ల్యాండింగ్ జరిగింది.అయితే హెలికాప్టర్ ఎమర్జెన్సీ ల్యాండింగ్ సందర్భంగా ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని జామ్‌నగర్ పోలీసులు తెలిపారు. సోమవారం ఉదయం 11 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకుందని చెప్పారు. జామ్‌నగర్ ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌కు సరిగ్గా 22 కిలోమీటర్ల దూరంలో చెంగా గ్రామం ఉంటుందన్నారు. ఈ ఘటనపై ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ అధికారిక ప్రకటన చేయాల్సి ఉందని చెప్పారు.

## పోప్ ఫ్రాన్సిస్ మృతి పట్ల పుతిన్ సంతాపం



**మాస్కో ఏప్రిల్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
క్రైస్తవ మత పెద్ద పోప్ ఫ్రాన్సిస్ మృతి పట్ల రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ సంతాపం వ్యక్తం చేశారు. వాటికన్‌లో 88 ఏళ్ల ఫ్రాన్సిస్ ఇవాళ కన్నుమూసిన విషయం తెలిసిందే. ఎన్నో సందర్భాల్లో అద్భుతమైన ఆ వ్యక్తితో సంభాషణలు చేసినట్లు పుతిన్ గుర్తు చేశారు. పోప్‌తో జరిగిన భేటీ తనకు ఎప్పుడూ గుర్తుండిపోతుందన్నారు. ఫ్రాన్సిస్ తన హెూదాలో .. రష్యన్ ఆర్థోడక్స్, రోమన్ క్యాథలిక్ చర్చి మధ్య సంప్రదింపులను ప్రోత్సహించినట్లు పుతిన్ వెల్లడించారు. వాటికన్, రష్యా మధ్య బంధాలు బలోపేతం అయ్యేలా చూశారన్నారు. క్రెమ్లిన్ వెబ్‌సైట్‌లో పుతిన్ తన సంతాపం సందేశాన్ని పోస్టు చేశారుక్రైస్తవ బోధనలకు విశ్వసనీయమైన సేవకుడిగా పోప్ ఫ్రాన్సిస్‌కు అంతర్జాతీయ గుర్తింపు ఉన్నట్లు పుతిన్ తెలిపారు. తెలివైన మతతత్వవాది అని, రాజనీతిపరుడని, మానవత్వం.. న్యాయం విలువల కోసం నిత్యం పోరాడినట్లు చెప్పారు. పుతిన్, పోప్ ఫ్రాన్సిస్ మధ్య వ్యక్తికత బంధం ఉన్నట్లు క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్రీ పీస్కోవ్ తెలిపారు. ఆ ఇద్దరూ మూడు సార్లు పర్సనల్‌గా కలుసుకున్నట్లు చెప్పారు. 2013, 2015, 2019 సంవత్సరాల్లో వాటికన్ సిటీలో పుతిన్ పర్యటించినప్పుడు ఆ ఇద్దరూ భేటీ అయినట్లు తెలిపారు. చివరిసారి డిసెంబర్ 2021లో ఆ ఇద్దరూ ఫోన్‌లో సంభాషించినట్లు చెప్పారు.

## మూడ్రోజులు మద్యం షాపుల మూసివేత



**హైదరాబాద్, ఏప్రిల్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
నగరంలోని మందుబాబులకు ఇది షాకింగ్ న్యూస్. ఈ నెల 23వ తేదీన హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో సోమవారం సాయంత్రం 4 గంటల నుంచి బుధవారం సాయంత్రం 6 గంటల వరకూ మద్యం అమ్మకాలు బంద్‌అయ్యాయి. వైన్స్, బార్ అండ్ రెస్టారెంట్లు–, క్లబ్‌లు మూసి వేయాలని పోలీసులు అదేశాలు జారీ చేశారు. తిరిగి బుధవారం సాయంత్రం నుంచి ప్రారంభం కానున్న మద్యం అమ్మకాలు.. శుక్రవారం ఆగిపోనున్నాయి. శుక్రవారం ఎన్నికల కౌంటింగ్ కారణం మళ్లీ అన్ని మద్యం షాపులు బంద్ అవుతాయి.

## 23న టెన్త్ ఫలితాల విడుదల




**విజయవాడ, ఏప్రిల్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పదవ తరగతి పరీక్ష ఫలితాల విడుదలకు రంగం సిద్ధమైంది. ఏప్రిల్ 23వ తేదీన ఈ పరీక్ష ఫలితాలు విడుదల చేస్తామని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయ రామరాజు వెల్లడించారు. సోమవారం విజయవాడలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. అధికారిక వెబ్ సైట్, వాట్సాప్, లీప్ యాప్‌లలో ఫలితాలు చూసుకోవచ్చని వివరించారు. మార్చి 2025, ఎస్ఎస్‌సీ పబ్లిక్ పరీక్షల ఫలితాలు, ఓపెన్ స్కూల్ పదో తరగతితోపాటు– ఓపెన్ స్కూల్ ఇంటర్మీడియట్ ఫలితాలు విడుదల చేస్తామని చెప్పారు. ఆ రోజు ఉదయం 10.00 గంటలకు విడుదల చేస్తామని స్పష్టం చేశారు. అభ్యర్థులు ఫలితాలను అధికారిక మొబైల్ యాప్‌లలో అందుబాటు–లో ఉంటాయని పేర్కొన్నారు.

# అమెరికాతో ట్రేడ్ డీల్..

### ఆ దేశాలకు చైనా సీరియస్ వార్నింగ్




**ఖమ్మం ఏప్రిల్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వాణిజ్య యుద్ధానికి తెరతీసిన విషయం తెలిసిందే. ఏప్రిల్ 2న భారత్ సహా అనేక దేశాలపై ప్రతీకార సుంకాలు ప్రకటించారు. అయితే, వాణిజ్య చర్చల కోసం వాటిని 90 రోజుల పాటు నిలిపివేస్తూ నిర్ణయం ప్రకటించారు. చైనా కు మాత్రం ఎలాంటి మినహాయింపులూ ఇవ్వలేదు. దీంతో ప్రభావిత దేశాలు అమెరికాతో సంప్రదింపులు జరుపుతున్నాయి . ఈ సుంకాల నుంచి మినహాయింపులు పొందాలంటే చైనాతో ఉన్న ఆర్థిక సంబంధాలను విరమించాల్సిందిగా ట్రంప్ సర్కార్ కొన్ని మిత్రదేశాలకు స్పష్టంగా సూచించినట్లు పలు నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఈ వార్తలపై చైనా తీవ్రంగా స్పందించింది. తమ దేశ ప్రయోజనాలకు నష్టం కలిగించేలా నిర్ణయాలు తీసుకుంటే ప్రతీకార చర్యలు తప్పవని హెచ్చరించింది.అమెరికాతో ఒప్పందాలు చేసుకునే సందర్భంలో వాటి ప్రభావం చైనా ప్రజల ప్రయోజనాలను దెబ్బతీయగలదనుకుంటే అలాంటి ఒప్పందాలను మేం తీవ్రంగా వ్యతిరేకిస్తాం. అలాంటి పరిస్థితి ఎదురైతే దాన్ని మేం ఎప్పటికీ అంగీకరించం. మా నుంచి వచ్చే ప్రతిస్పందన కూడా అదే స్థాయిలో ఉంటుంది. బుజ్జగింపులతో శాంతి స్థాపన జరగదు. రాజీ పడితే గౌరవం లభించదు. తక్షణ లాభాల కోసం తీసుకునే నిర్ణయాలు భవిష్యత్తులో తీవ్రమైన నష్టాలను కలిగించే అవకాశం ఉందన్న విషయాన్ని దేశాలు గుర్తించుకోవాలి' అని పేర్కొంది. ఈ మేరకు చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. చైనా ఉత్పత్తులపై అమెరికా టారిఫ్‌లు 245 శాతానికి పెరిగిన విషయం తెలిసిందే.

# తెలంగాణను కాపాడుకోవడమే మన లక్ష్యం

**-కేసీఆర్‌కు, కార్యాకర్తలకు మధ్య వారధిగా ఉంటా**
**-ఖమ్మం నుంచి ముగ్గురు మంత్రులున్నా సున్నా**
**-ఎమ్మెల్సీ కవిత వెల్లడి**



**ఖమ్మం ఏప్రిల్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
తెలంగాణను కాపాడటమే బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల ప్రథమ కర్తవ్యమని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నుంచి తెలంగాణను కాపాడే బాధ్యత బీఆర్ఎస్ పార్టీకే ఉంటుందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు, పార్టీ కార్యకర్తలకు వారధిగా ఉంటానని స్పష్టం చేశారు. సోమవారం జరిగిన సన్నాహక సమావేశంలో కార్యకర్తల సమస్యలను కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తానని, ఏ చిన్న అవసరమున్నా తనను కార్యకర్తలు సంప్రదించవచ్చని పేర్కొన్నారు. కార్యకర్తలను కాపాడు కోవడాన్ని బాధ్యతగా భావిస్తానని స్పష్టం చేశారు. అన్ని రంగాల్లో తెలంగాణను నెంబర్ వన్‌గా నిలబెట్టిన ఘనత కేసీఆర్‌ది అని ఎమ్మెల్సీ కవిత కొనియాడారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ఒక్క సెకండ్ కూడా విశ్రాంతి తీసుకోకుండా కేసీఆర్ పని చేశారని తెలిపారు. సీతారామ ప్రాజెక్టును నిర్మించి 3.5 లక్షల ఎకరాలకు కేసీఆర్ నీళ్లు అందించారని పేర్కొన్నారు. తెలంగాణకు బీఆర్ఎస్ పార్టీనే శ్రీరామ రక్ష అని అన్నారు. తెలంగాణ ఉద్యమం పుట్టిందే ఖమ్మం జిల్లా నుంచి అని చెప్పారు.1969లో ఖమ్మంలో మొదలైన తెలంగాణ ఉద్యమం రాష్ట్రమంతా పాకిందని అన్నారు. భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన ద్రోహి అని విమర్శించారు. భద్రాచలంలో ఉప ఎన్నిక వస్తే గెలుపు బీఆర్ఎస్ పార్టీదే అని చెప్పారు. అలాంటి ద్రోహులను చాలామందిని చూశామని.. కుట్రలను చూశామన్నారు. ఖమ్మం జిల్లా నుంచి ముగ్గురు మంత్రులున్నా మూడు పైసలు తేలేదని ఎమ్మెల్సీ కవిత అన్నారు. ఆత్మీయ భరోసా కింద నిరుపేదలకు డబ్బులు ఇవ్వకుండా కాంగ్రెస్ సర్కార్ మోసం చేసిందని విమర్శించారు. మన కళ్ల ముందే మన తెలంగాణ ఆగమవుతుంటే చూస్తూ ఊరుకోవద్దని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలను సమీకరించాల్సిన అవసరం ఉందని అన్నారు. అప్పులపై ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క విపరీతమైన అబద్దాలు చెబుతున్నారని తెలిపారు. 2004లో వచ్చిన పీనుగులా ఉన్న కాంగ్రెస్ పార్టీ బీఆర్ఎస్ తో పొత్తు పెట్టుకొని అధికారంలోకి వచ్చిందని పేర్కొన్నారు. 2004లోనే తెలంగాణ ఇచ్చేస్తామని చెప్పిన కాంగ్రెస్ పదేళ్లు ప్రజలను ఏడిపించిందని అన్నారు.

# అసలును పోలిన నకిలీ నోట్లు

### -అప్రమత్తం చేసిన కేంద్ర హోంశాఖ



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
దేశంలో దొంగనోట్ల చెలామణి కలకలం రేపుతోంది. దొంగనోట్ల తయారీ దారులు అత్యంత పకడబ్బందీగా ముద్రణ చేస్తున్నట్లు తెలుస్తోంది. నోట్ల రద్దు తరవాత వాటిని చాలవరకు కంట్రోల్ చేసినా, అడపాదడపా పట్టుబడుతూనే ఉన్నాయి. తాజాగా అత్యాధునిక టెక్నాలజీ వాడి తయారుచేసిన రూ.500 దొంగనోట్లు చెలామణిలోకి వచ్చినట్లు కేంద్ర హోంశాఖ హెచ్చరికలు జారీ చేయడం మరింత కలకలం రేపింది. ప్రజలు వీటి విషయంలో అప్రమత్తంగా ఉండాలని పేర్కొంది. ఈ సమాచారాన్ని డీఆర్ఐ, ఎఫ్ఐయూ, సీబీఐ, ఎన్ఐఏ, సెబీతో కూడా పంచుకొంది. ఆ దొంగనోట్ల ప్రింటింగ్, నాణ్యత చాలావరకు అసలు నోట్లులాగే ఉన్నట్లు వెల్లడించింది. వాటిని గుర్తించడం కూడా చాలా క్లిష్టంగా మారిందని వెల్లడించింది. ఈ చిన్న తప్పును గుర్తించాలంటే ఆ నోటును క్షుణ్ణంగా పరీక్షించాల్సి ఉంటుందని పేర్కొంది. ఇలాంటి నకిలీ నోట్లు అత్యంత ప్రమాదకరమని వెల్లడించింది. వీటి విషయంలో ఆర్థిక సంస్థలు, బ్యాంకులు, ఏజెన్సీలను అప్రమత్తంగా ఉంచినట్లు– అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే పెద్ద సంఖ్యలో ఇవి మార్కెట్లో ఉన్నాయని హెచ్చరించారు. మార్కెట్లో మొత్తం ఎన్ని ఉన్నాయో గుర్తించడం కష్టమని ఉగ్ర ఫైనాన్స్‌పై దర్యాప్తు చేస్తున్న ఓ అధికారి చెప్పారు. ప్రజలు, వ్యాపార సంస్థలు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. దీంతో ఇప్పుడు ప్రజలు కూడా అసలేదో, నకిలీ ఏదో తెలుసుకోలేక కంగారు పడాల్సిన దుస్థితి ఏర్పడింది.

# భారత్ చేరుకున్న జెడి వాన్స్

### ప్రధాని మోడీతో ప్రత్యేకంగా సమావేశం



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
భారత పర్యటనకు వచ్చిన అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఢిల్లీ వేదికగా ప్రధాని నరేంద్ర మోదీతో భేటీ–అయ్యారు. ఇరునేతల మధ్య వాణిజ్యం, సుంకాలు, ప్రాంతీయ భద్రతతోపాటు పలు ద్వైపాక్షిక అంశాలు చర్చకు రానున్నట్లు– సమాచారం. అమెరికా ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత జేడీ వాన్స్ భారత్ పర్యటనకు రావడం ఇదే తొలిసారి. ఆయన వెంట భార్య ఉషా వాన్స్, ముగ్గురు పిల్లలతో పాటు– ఆ దేశ ఉన్నతస్థాయి ప్రతినిధులు ఉన్నారు. సోమవారం ఉదయం ఢిల్లీలో దిగిన జేడీ వాన్స్ దంపతులకు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్, ఇతర అధికారులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వాన్స్ పిల్లలు మీడియా దృష్టిని ఆకర్షించారు. కుమారులు ఇవాన్, వివేక్, కుమార్తె మిరాబెల్ భారతీయ సంప్రదాయ దుస్తుల్లో కన్పించారు. అనంతరం వారు ఢిల్లీలోని అక్షర్‌ధామ్ ఆలయాన్ని సందర్శించారు. భేటీ అనంతరం వాన్స్ దంపతులు, అమెరికా అధికారులకు ప్రధాని మోదీ ప్రత్యేక విందు ఏర్పాటు చేశారు. ట్రంప్ టారిఫ్ దూకుడు వేళ.. ఈ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది.